ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 1: వర్షాకాలం జ్వరాలు సోకే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ వసంత్ రావు పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ మండలం చీర్లవంచ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తూ వేడిగా ఉన్నప్పుడే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేశారు.

కుక్కదాడిలో ఇద్దరికి తీవ్రగాయాలు

చందుర్తి, సెప్టెంబర్1: చందుర్తి మండలం మూడపెల్లి గ్రామంలో ఆదివారం ఇద్దరిని కుక్క కరిచింది. గ్రామస్తుల తెలిపిన ప్రకారం, గ్రామానికి చెందిన మల్లారెడ్డి, మధు బస్టాండ్ వద్ద ఉండగా అటువైపు వచ్చిన ఓ పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. వీరిని వేములవాడలోని దవాఖానకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

జక్కుల చెరువు నిండేదెట్లా....

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 1: గొల్లపల్లి, బొప్పాపూర్ రైతుల వరప్రదాయని జక్కుల చెరువులోకి నీరు రావడానికి దారేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గంభీరావుపేట మండలం సింగ సముద్రం కుడివైపు మత్తడి నుంచి మిగులు నీరు వెళ్లేందుకు ప్రత్యేక కాలువ ద్వారా నీరు జక్కుల చెరువుకు చేరేది కానీ కొంత కాలంగా సదరు కాల్వ ను మట్టితో పూడ్చి నీటి ప్రవాహ దారిని మళ్లించడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువకు అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి చెరువు నిండేందుకు మార్గం సుగమం చేయాలని రైతులు కోరుతున్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసన

వేములవాడ, సెప్టెంబర్ 1: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసినట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు తెలిపారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని సెంట్రింగ్ కార్మికుల భవనంలో నిరసన వ్యక్తం చేసి ఆయన మాట్లాడారు. అమెరికా మద్దతుతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతోందని వెంటనే దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కార్మిక సంఘాల నాయకులు గాజుల పోశెట్టి, శీలం రవి, కుమ్మరి కొమురయ్య, లక్ష్మణ్, అంజయ్య, సెంట్రింగ్ యూనియన్ సంఘం అధ్యక్షుడు ఎల్లా స్వామి, దుర్గయ్య, సింగారపు స్వామి, గాజుల రాము, కమలాకర్ తదితరులున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

- ఎంప్లాయిస్ జేఏసీ, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్
- కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ సంఘాల ధర్నా

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న టీఎన్‌జీవో నాయకులు

కలెక్టరేట్, సెప్టెంబర్ 1 : సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఎంప్లాయిస్ జేఏసీ, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ పెన్షన్ విధానం అంతమయ్యే వరకు విశ్రమించకుండా పాత పెన్షన్ విధానాన్ని సాధించుకోవాలని ఆదివారం అన్ని సంఘాల ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. సీపీఎస్ పెన్షన్ విధానాన్ని ఖండిస్తూ ప్రభుత్వ ఉద్యోగులందరూ సెప్టెంబర్ 1ని బ్లాక్ డేగా ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి గాజుల సుదర్శన్, మెట్ట శ్రీకాంత్, రియాజ్ పాషా, జయంత్‌కుమార్, శ్రీనివాస్ రావు, భూపాల్‌రెడ్డి, కొటికొప్పుల రవి, సురేశ్, నారాయణ, శర్మ నాయక్, బికూ నాయక్, మోతీలాల్, మరాఠీ అజయ్, గంగయ్య, హరిప్రసాద్, పరిపెల్లి రవికుమార్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు సాగర్, లక్ష్మణ్, సీపీఎస్ నాయకులు రవీందర్, నవీన్, మధు, చిరంజీవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలింగార్చన

వేములవాడ టౌన్ : ఆలయ అద్దాలమండపంలో మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 1: శ్రావణమాసం మాసశివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయంలో రాత్రి ఆలయ ప్రధానార్చకులు నమిలకొండ ఉమేశ్ ఆధ్వర్యంలో అర్చకులు మహాలింగార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మమాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు అర్చకులు 15 ఆవరణలతో 366 లింగాలను, 366 జ్యోతులను లింగాకారంగా వెలిగించి ఆయా ఆవరణలయందు అధిష్ఠాన దేవతలను సూచిస్తూ వేదమంత్రోచ్చారణాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా రుద్రహోమం

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 1 : శ్రావణమాసం మాసశివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయంలో రుద్రహోమాన్ని ఆలయ ప్రధానార్చకులు నమిలకొండ ఉమేశ్ ఆధ్వర్యంలో అర్చకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి 11 మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం ఆలయ అద్దాలమండపంలో వేదమూర్తులైన బ్రాహ్మణుల మంత్రోచ్చారణలమధ్య స్వస్తిపుణ్యాహవాచనం, కలశస్థాపనం, మండపప్రతిష్ఠచేసి రుద్రహోమాన్ని నిర్వహించారు. ఈ యాగంలో అర్చకులు పూర్ణాహుతితో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, పర్యవేక్షకులు తిరుపతిరావు, ఆలయ వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

కనుల పండువగా సాంస్కృతిక కార్యక్రమాలు

వేములవాడ టౌన్, సెప్టెంబర్ 1 : శ్రావణమాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై ఆదివారం లంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. శివపాద మంజీర నాదం అనే పేరుతో చిన్నారుల నృత్య కార్యక్రమం ఆహూతులను ఆనందడోలికల్లో ముంచివేసింది. ఈవో వినోద్‌రెడ్డికి నిర్వాహకులు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో దాదాపు 60 మంది చిన్నారులు ప్రముఖ వ్యాపారి నగుబోతు రవీందర్ పాల్గొన్నారు.

ఈవోతో కళాకారులు

క్యాన్సర్‌తో పోరాడి ఓడిన సంతోష్

- 70లక్షలు ఖర్చుపెట్టిన దక్కని నిరుపేద ప్రాణం

సంతోష్ (ఫైల్)

వేములవాడ, సెప్టెంబర్ 1: మధ్యతరగతి కుటుంబం.. మాయదారి రోగం.. అయినా బతుకుతాడేమో అన్న ఆశతో రూ.70 లక్షలు ఖర్చు పెట్టి నా ప్రాణం దక్కలేదు. వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్‌కు చెందిన వడ్ల కొండ సంతోష్ (35) సుమారు ఏడు మాసాలుగా బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడి ఆదివారం హైదరాబాద్‌లో హైటెక్ సిటీ యశోద దవాఖానలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడు అద్దె గదులు నింపుతూ, వాటర్ బాటిల్ హోల్‌సేల్ వ్యాపారం చేస్తూ చిరు వ్యాపారంతో జీవనోపాధి పొందుతున్నాడు. అయితే మాయదారి రోగం క్యాన్సర్ అని తేలడంతో మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు దక్కించుకోవాలని భార్య ఆమని బంధువుల సహాయంతో దాదాపు రూ.70లక్షలు వెచ్చించింది. శక్తికి మించి అప్పులు చేసి ఖర్చు చేసినా ప్రాణాలు దక్కకపోవడంతో తట్టుకోలేక తల్లడిల్లిపోయింది. సంతోష్‌కు భార్య ఆమనితోపాటు రెండు సంవత్సరాల కుమారుడు వేద క్రిష్ ఉన్నాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు, కాలనీవాసులు కోరారు.

సమీకృత మార్కెట్ భవనాన్ని వినియోగించుకోండి

వేములవాడ, సెప్టెంబర్ 1: వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్‌లో రెండున్నర కోట్ల రూపాయలతో నిర్మించిన సమీకృత వెజిటేబుల్ మార్కెట్ భవనాన్ని వినియోగించుకోవాలని కౌన్సిలర్లు గోలి మహేశ్, సిరిగిరి రామ్‌చందర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వర్షాల నేపథ్యంలో ఎలాంటి సదుపాయాలు లేకుండా ఉన్న రెండో బైపాస్ రహదారిలో వర్షానికి తడుస్తూ రైతులు వ్యాపారులు, కూరగాయలు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వసతి సౌకర్యాలు ఉన్న సమీకృత మార్కెట్ భవనాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాలు కాపాడుకోవాలని రైతులకు, వ్యాపారులకు సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

బోయినపల్లి, సెప్టెంబర్ 1: బోయినపల్లి మండలం కుదురుపాక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వసంతరావు పరిశీలించారు. ఆరోగ్యం కేంద్రంలోని రిజిస్టర్లను పరిశీలించారు. భారీ వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గోపాలరావుపల్లె గుట్టలో జలపాతం

గోపాలరావుపల్లె శివారులో గుట్టలోంచి జాలువారుతున్న జలపాతం

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 1: తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లె శివారులోని గుట్టల్లో జలపాతం కనువిందు చేస్తున్నది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో గుట్టల్లోంచి వచ్చే వర్షపు నీరు జాలువారుతూ కుంటాల జలపాతాన్ని తలపిస్తున్నది. ఇక్కడికి గోపాలరావుపల్లె, తాడూరు పరిసర గ్రామాల వాసులు చేరుకుని సందడి చేస్తున్నారు.

పాతాల గంగ పైపైకి

మల్కపేట గ్రామంలో బోరుబావి నుంచి ఉబికి వస్తున్న నీరు

కోనరావుపేట, సెప్టెంబర్ 1: పాతాల గంగ పై పైకి దానం తటదే ఉబికివస్తున్నది. వివరాల్లోకి వెళితే.. కోనరావుపేట మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన రైతు జంగిటి లింగయ్య కొన్ని సంవత్సరాలు క్రితం పంట పొలంలో బోరు బావి వేయించాడు. ఈక్రమంలో మల్కపేట రిజర్వాయర్ ప్యాకేజీ-9 బండ్-2 కింది భాగంలో బోరు బావి ఉండడంతో బోరు నుంచి నీరు పైకి ఉబికివస్తున్నది. రైతు రోజుమాదిరిగానే వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి బోరుబావి నుంచి ఉబికివస్తున్న నీటిని చూసి సంతోషం వ్యక్తం చేశాడు.

ప్రిన్సిపాల్ సేవలు మరువలేనివి

అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో సన్మానిస్తున్న అధ్యాపక బృందం

వేములవాడ రూరల్, సెప్టెంబర్ 1: అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సేవలు మరువలేనివని అధ్యాపకులు కొనియాడారు. వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం రాత్రి నిర్వహించారు. అనంతరం రాజగోపాల్ దంపతులను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకరచారి, పీవీ రఘుతోపాటు అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు.

ఐపీఎస్ రాంరెడ్డికి సన్మానం

ఐపీఎస్ అధికారిగా పదోన్నతి పొందిన రాంరెడ్డి నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 1: ఐపీఎస్‌గా ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన భూక్యా రాంరెడ్డి నాయక్‌ను సిరిసిల్లలో ఆదివారం సన్మానించారు. స్థానిక జీకే కల్యాణ మండపంలో గోర్ సిక్‌వాడీ టీచర్ రాష్ట్ర వెల్ఫేర్ అసోసియేషన్, తదితర సంఘాల ఆధ్వర్యంలో రాంరెడ్డి నాయక్‌ను గజమాలతో సత్కరించి అభినందించారు. ఇక్కడ గోర్ సిక్‌వాడీ రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రాములునాయక్, రాజూ నాయక్, హరీశ్ నాయక్, రాందాస్ నాయక్, రవిలాల్, లకావత్ మోతీలాల్, బానోతు సంతోష్‌నాయక్, భూక్యా గజన్‌లాల్ నాయక్, శర్మన్‌నాయక్, మదన్‌నాయక్, హజూనాయక్, రెడ్డి నాయక్, తదితరులు పాల్గొన్నారు.